# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-01-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ఆంధ్రప్రదేశ్ లో పర్యాటక రంగాన్ని సృజనాత్మక ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**

**2. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ విజయం సాధించేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి సూచించారు.**

**3. మడ అడవుల్లో జీవ వైవిధ్యాన్ని రక్షించడంలో ఆంధ్రప్రదేశ్ జాతీయస్థాయిలో మార్గదర్శకంగా నిలవాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.**

**4. ఆంధ్రప్రదేశ్ లో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తోందని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ తెలిపారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ లో పర్యాటక రంగాన్ని సృజనాత్మక ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. విజయవాడ పున్నమీ ఘాట్ లో నిర్వహించిన "ఆవకాయ్- అమరావతి ఉత్సవం"లో ఐరోపా సమాఖ్య రాయబారి హెర్వే డెల్ఫీతో కలిసి నిన్న రాత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ..ఆవకాయ్ అంటే గుర్తొచ్చేది ఆంధ్రప్రదేశ్ అని, ఇది కేవలం ఆహారం మాత్రమే కాదు, తెలుగు సంప్రదాయ చిహ్నమని తెలిపారు. తెలుగుకు వేల సంవత్సరాల చరిత్ర ఉందని, అంతా కలిసి మెలసి ఉండటం సంస్కృతిలో భాగమని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ,

వాయిస్ 27 సెకన్లు

అంతకుముందు కృష్ణా నదిలో హౌస్ బోట్ ను ప్రారంభించారు.కృష్ణాహారతిని ముఖ్యమంత్రి తిలకించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని తూర్పుగోదావరి జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పర్యటిస్తారు. ఇందులో భాగంగా జిల్లాలోని మండపేట నియోజకవర్గం రాయవరంలో చేరుకుని వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తారు. అనంతరం రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని పట్టాదారు పాసు పుస్తకాలను రైతులకు పంపిణీ చేస్తారు. తర్వాత రాయవరంలో ప్రజా వేదిక సభలో ప్రసంగిస్తారు. అలాగే స్థానిక నియోజకవర్గ కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అధిక స్థానాల్లో విజయం సాధించేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలనీ తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ లోని గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి నిన్న ప్రసంగించారు. పంచాయతీ ఎన్నికల్లో 66శాతం విజయాలు సాధించామని ఇక మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. వీబీ జీ రామ్ జీ పథకం, ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ –సర్‌పై కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్ లో ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రతిపాదించిన ఏపీ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను రాష్ట్రమంత్రి వర్గం ఆమోదించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశ నిర్ణయాలను రాష్ట్ర సమాచార, ప్రజా సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి పాత్రికేయులకు వెల్లడించారు. 35కు పైగా అజెండా అంశాలకు ఈ మంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించిందని చెప్పారు. ఆంధ్రఅబశ్రీశ్రీప్రదేశ్ లాజిస్టిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ క్లస్టర్ అభివృద్ధి పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 45 క్లస్టర్ల కేంద్రాలు ఏర్పాటు కానున్నాయని మంత్రి తెలియజేస్తూ.....

వాయిస్ 30సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురంలో పర్యటిస్తున్నారు. "పీఠికాపుర సంక్రాంతి మహోత్సవం" పేరిట స్థానిక కళాశాల మైదానంలో నిర్వహించనున్న ముందస్తు సంక్రాంతి సంబరాలను ఆయన ఈ రోజు ప్రారంభిస్తారు. అనంతరం నియోజకవర్గ పరిధిలో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. సాయంత్రం పిఠాపురం పురపాలక సంఘం పరిధిలో ఇటీవల ముంపునకు గురైన ఇందిరానగర్ కాలనీ, రైల్వే స్టేషన్ సమీపంలోని మోహన్ నగర్ లను సందర్శిస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

మడఅడవుల్లో జీవ వైవిధ్యాన్ని రక్షించడంలో ఆంధ్రప్రదేశ్ జాతీయస్థాయిలో మార్గదర్శకంగా నిలవాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో "మడ అడవుల పెంపుదల – వాటి నుంచి సుస్థిర ఆదాయం అనే అంశంపై విజయవాడలో నిర్వహించిన జాతీయ స్థాయి కార్యశాలలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని గోదావరి, కృష్ణా బేసిన్ పరిధిలో తుపానుల వల్ల కలిగే నష్టాన్ని నివారించడానికి మడ అడవులను సమృద్ధిగా పెంచడం కీలకమని చెప్పారు. రాష్ట్రంలో 50 శాతం భూభాగంలో పచ్చదనం ఉండాలనే లక్ష్యంతో తీర ప్రాంతంలో గ్రేట్ గ్రీన్ వాల్ కార్యక్రమాన్ని ప్రణాళిక బద్ధంగా నిర్వహిస్తున్నామని పవన్ కళ్యాణ్ వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తోందని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ తెలిపారు. విజయవాడలో నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్– నరెడ్కో సెంట్రల్ జోన్

డైరీ–2026ను మంత్రి నిన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.

వాయిస్ 28 సెకన్లు

------------------------------

ఆంధ్రప్రదేశ్ లోని కోనసీమ ప్రభల తీర్థానికి 'రాష్ట్ర పండుగ' హోదానిస్తూ మంత్రిమండలి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, 400 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రభల తీర్థానికి రాష్ట్ర పండుగ హోదా కల్పించడం ద్వారా తెలుగు సంస్కృతికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంతో కోనసీమ ప్రాంతం ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు పొందుతుందని మంత్రి తెలియజేశారు.

------------------------------

ధాన్యాం నాణ్యతను కోల్పోకుండా నిల్వ చేయడానికి ఉపయోగించే 'సైలో' విధానాన్ని తెలంగాణలో అమలు చేయనున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రిఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో భారత ఆహార సంస్థ, రాష్ట్ర పౌర సరఫరాలశాఖ అధికారులతో ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'ఇంటిగ్రేటెడ్ క్లీనర్లు, డ్రయర్ల సాయంతో వరి, సోయాబీన్ లాంటి పంట ఉత్పత్తుల్లోని తేమను ఆధునిక పద్ధతిలో తొలగించడంతో ఎక్కువ కాలం నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. సైలో పద్ధతి అమల్లోకి వస్తే నిల్వ నిర్వహణ ఖర్చు తగ్గి ప్రభుత్వానికి వెయ్యి కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

------------------------------

ఆగ్నేయ బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాలలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా బలపడిందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది నైరుతి బంగాళాఖాతం మీదుగా పశ్చిమ–వాయువ్య దిశగా ప్రయాణించి ఈ రోజు సాయంత్రం శ్రీలంక వద్ద తీరాన్ని దాటే అవకాశం ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో ఈ రోజు, రేపు ఆంధ్రప్రదేశ్ లోని దక్షణ కోస్తా, రాయలసీమలోని తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వెల్లడించింది.

======================